
అగినపర్రులో ధాన్యం లోడ్ చేస్తున్న కూలీలు


వర్షాలకు నేల వాలిపోయిన వరి పంట


పామర్రులో వరి కుప్పలపై పరదాలు కట్టిన రైతులు


పమిడిముక్కలలో పనలపై ఉన్న వరిపైరులోకి చేరిన నీరు

వెంటాడుతున్న మిచాంగ్


వల్లూరుపాలెంలో ధాన్యపు రాశులను టార్పాలిన్‌తో కప్పిన రైతులు

మిచాంగ్ తుపాను ప్రభావం ప్రజలను వణికిస్తోంది. తుపాను తీరం దాటే సమయం దగ్గర పడే కొద్దీ వర్షం తీవ్రత పెరగటంతోపాటు ఈదురుగాలుల ప్రభావం ఎక్కువైంది. చలిగాలులు తీవ్రత బాగా ఎక్కువగా ఉండటంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. జనసంచారం లేక రహదారులు నిర్మానుష్యంగా మారాయి. మాగాణిలో వ్యవసాయ పనులు చురుగ్గా సాగుతున్న ప్రస్తుత తరుణంలో మిచాంగ్ తుపాను పిడుగులా వచ్చిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈదురుగాలుల ప్రభావంతో కోతకు వచ్చిన వరిపైరు పలుచోట్ల నేలకొరిగింది. కోత పూర్తయిన పొలాల్లో వరిపనలు వర్షం కారణంగా తడిసి ముద్దయ్యాయి. అలాగే యంత్రాల ద్వారా ధాన్యం కోత కోయించి నూర్పిడి చేసిన రైతులు ధాన్యాన్ని కాపాడుకోవటానికి నానా అవస్థలు పడుతున్నారు. టార్పాలిన్లు, పరదాలతో ధాన్యపు రాశులు వర్షం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా వర్షం తీవ్రత ఎక్కువైతే ధాన్యం దెబ్బతినే అవకాశం ఉందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయిలో రైతుల వద్దకు వెళ్లి పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

– తోట్లవల్లూరు/పమిడిముక్కల/పామర్రు


తోట్లవల్లూరులో ధాన్యాన్ని పరదాలతో కప్పుతున్న రైతులు

వేగంగా ధాన్యాన్ని తరలించండి

కృష్ణా జిల్లా జేసీ అపరాజితాసింగ్

భట్లపెనుమర్రు(మొవ్వ): రైతులు నూర్చుకుని కాటాలు వేయించుకుని బస్తాలకు ఎత్తిన ధాన్యాన్ని సత్వరం వాహనాల ద్వారా మిల్లులకు తరలించాలని కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజితాసింగ్ అధికారులకు సూచించారు. మిచాంగ్ తుపాను నేపథ్యంలో జేసీ స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్‌తో కలిసి సోమవారం మొవ్వ మండలంలో పర్యటించారు. ఇందులో భాగంగా భట్లపెనుమర్రు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, ఏవో కె. శివప్రసాద్‌ల ద్వారా పంట, ధాన్యం వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం తడవకుండా సమీపంలోని మార్కెట్ యార్డు గోదాముల్లో తాత్కాలికంగా భద్రపరచాలని, మొవ్వ మండలంలోని ధాన్యాన్ని ఏలూరు, గుంటూరు జిల్లాలోని పలు మిల్లులకు తరలించనున్న తరుణంలో మిల్లులకు ధాన్యం తరలించే లారీలకు కిరాయిలు ముందస్తుగా రైతులు చెల్లించుకోవాల్సి ఉంటుందని, ధాన్యం నగదు చెల్లించేటప్పుడు లారీ కిరాయిలు సైతం కలిపి చెల్లిస్తామని.. రైతులకు వివరించాలని అధికారులకు సూచించారు.

అధైర్య పడొద్దు..

ఎమ్మెల్యే కై లే అనిల్ కుమార్ మాట్లాడుతూ రైతు అధైర్య పడవద్దని, నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అలాగే ధాన్యాన్ని తరలించేందుకు అధిక సంఖ్యలో వాహనాలను ఏర్పాటు చేయాల్సిందిగా జేసీని కోరారు. డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్ గోపాలరావు, వీఏఏ ఎం. ప్రత్యూష, విఆర్‌వో కె. లక్ష్మీ తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులు అధైర్యపడొద్దు

గుడ్లవల్లేరు: తుపాను కారణంగా పంటదెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని గుడ్లవల్లేరు మండల వ్యవసాయ అధికారి సునీల్ అన్నారు. సోమవారం మండలంలోని వడ్లమన్నాడు గ్రామాల్లో తుపాను కారణంగా నేలకొరిగిన వరి పొలాలను ఆయన పరిశీలించారు. వీఆర్‌ఓ లక్ష్మయ్య, జిల్లా వ్యవసాయ సలహా సభ్యుడు ప్రభాకరరావు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలిస్తున్న జేసీ అపరాజితాసింగ్, ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్

ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించండి

ముదినేపల్లి రూరల్: మండలంలోని రైతులు కోతలు కోసిన వరిపైరును నూర్పిడి చేసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని మండవల్లి సబ్‌డివిజన్ ఏడీఏ జి.వెంకటమణి అన్నారు. వడాలి, కొరగుంటపాలెం, సింగరాయపాలెం, శ్రీహరిపురం గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించి పనలపై ఉన్న పైరును, ధాన్యపు రాశులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. తుపాను ప్రభావం మరో మూడు రోజుల పాటు కొనసాగుతుందని వాతావరణ శాఖ హెచ్చరికలు చేస్తున్న నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు.

ఆఫ్‌లైన్లో కొనుగోలు..

కైకలూరు: నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 22,235 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు జరిగింది. ఇప్పటివరకు 9,800 ఎకరాల్లో వరి కోతలు జరిగాయి. నాలుగు మండలాల్లో 12,435 ఎకరాల్లో వివిధ దశల్లో వరిపైరు ఉంది. సోమవారం ఉదయానికి కైకలూరులో 7.6, కలిదిండి 8, మండవల్లి 8.4, ముదినేపల్లి 8.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇప్పటికే కైలూరు మండలంలో 3000 మెట్రిక్ టన్నులు, కలిదిండిలో 210 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేశారు. ముదినేపల్లి, మండవల్లి మండలాల్లోను వరి కొనుగోలు ఎక్కువగా జరిగింది. తామరకొల్లు గ్రామంలో కుప్పలుగా వేసిన వరిని ట్రాక్టర్లలో రైతులు తరలిస్తున్నారు. ఈ సందర్భంగా కైకలూరు వ్యవసాయాధికారి ఆర్. దివ్య మాట్లాడుతూ తుపాను కారణంగా ప్రభుత్వం ఆన్‌లైన్‌లో అలస్యం అవుతోందని ఆఫ్‌లైన్‌లో కొనుగోలుకు అవకాశం కల్పించిందన్నారు.

ధాన్యాన్ని మిల్లులకు చేర్చాలి

పమిడిముక్కల: రైతుల వద్ద నున్న ధాన్యం అంతా కొనుగోలు చేసి, సకాలంలో మిల్లులకు తరలించాలని జేసీ డాక్టర్ అపరాజితాసింగ్ అధికారులను ఆదేశించారు. జేసీ ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్‌తో కలిసి సోమవారం మండలంలోని మనుమంతపురం, కపిలేశ్వరపురం గ్రామాల్లో పర్యటించి నేలవాలిన, పనలపై ఉన్న వరిపంటను పరిశీలించారు. ధాన్యం తరలింపు ప్రక్రియను పరిశీలించి తహసీల్దార్ రాజ్యలక్ష్మిని, రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

మండవల్లి: తుపాను కారణంగా కోతకు వచ్చిన వరిపైరు కోతలు వాయిదా వేయాలని ఏడీఏ జి. వెంకటమణి, ఏఓ షేక్ జరీనా సూచించారు. సోమవారం వారు మాట్లాడుతూ మండలంలో 3,900 ఎకరాల్లో వరిసాగు జరగగా, 80 శాతం వ్యవసాయ పనులు పూర్తి అయ్యాయన్నారు. ఇప్పటికే వరి పంట కోసి పనలు చేలో ఉంటే తక్షణమే పనలను కట్టలు కట్టి గూడు, కుప్పలు పోసి పంటను వర్షం నుంచి తడవకుండా రక్షించుకోవాలన్నారు. తడిసిన వరి పనలలో మొలకలు రాకుండా ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలన్నారు.


పడిపోయిన పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు


వడాలిలో ధాన్యపు రాశుల వద్ద రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ


తామరకొల్లులో ధాన్యం తరలింపును పరిశీలిస్తున్న తహసీల్దార్ మురళీకృష్ణ, ఏవో దివ్య


కలిదిండి మండలంలో వరి కుప్పలను పరిశీలిస్తున్న తహసీల్దార్ వంశీ

త్రై సిద్ధాంతంపై ప్రచారం



కై కలూరు: కార్తిక మాసోత్సవాలను పురస్కరించుకుని భీమవరం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంతంపై వింజరం గ్రామంలో సోమవారం అవగాహన కలిగించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ప్రచారం చేశారు.

యూటీఎఫ్ ఆడిట్ కమిటీకి ఇద్దరు ఎంపిక



మండవల్లి: యూటీఎఫ్ ఏలూరు జిల్లా కమిటీలో మండవల్లి మండలం నుంచి ఇద్దరికి ప్రాతినిధ్యం లభించినట్లు జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు సీహెచ్ పిచ్చోడు తెలిపారు. జిల్లా కార్యవర్గ సభ్యునిగా మేడా శ్రీనివాసరావు, ఆడిట్ కమిటీ సభ్యునిగా సీహెచ్ పిచ్చోడు ఎంపికైనట్లు తెలిపారు.

శివుడికి లక్ష రుద్రార్చన



కలిదిండి: కార్తిక మాసం మూడో సోమవారం సందర్భంగా మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రాలు, శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కోరుకొల్లులో పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో దేవదాయ శాఖ శింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేద పండితులు లక్ష రుద్రార్చన ఘనంగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించారు.

రైతుల అభ్యున్నతే లక్ష్యం

పామర్రు: స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులు రైతుల అభ్యున్నతికి కృషి చేయాలని పామర్రు శాసన సభ్యులు కై లే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో నూతనంగా ఏర్పడిన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం పామర్రు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. తొలుత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కమిటీ చైర్ పర్సన్‌గా తుమ్మల ఉషారాణి, వైస్ చైర్మన్‌గా మహ్మద్ నవముద్దీన్, కమిటీ డైరెక్టర్లుగా కూసం పెద వెంకటరెడ్డి, కొండవల్లి రజని, కొలుసు ఆదిలక్ష్మి, పేటేటి ఆదియ్య, సజ్జ వెంకట సుబ్రమణ్యేశ్వరరావు, ప్రాకర్ల లక్ష్మి, చాట్లనాగరత్నం, కొల్లూరి ధనలక్ష్మి, పాముల వనజ, బి. నాగరాజు, శీతాల రాజ్యలక్ష్మి, నందిపాటిసాంబ శివ ప్రసాద రెడ్డి, శాయన నాగరాజులచే ఏఎంసీ కార్యదర్శి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్‌యార్డు ద్వారా రైతులకు అన్నిరకాల సేవలను అందించాలని అన్నారు. ఏఎంసీలలో ఉన్న గూడౌన్‌లను రైతుల అవసరాలకు సక్రమంగా వినియోగించాలని అన్నారు. కార్యక్రమంలో మండల అర్బీకేల కన్వీనర్ ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, పార్టీ నేతలు బొమ్మారెడ్డి అప్పిరెడ్డి, హుస్సేన్, ఏఎంసీ కార్యదర్శి శివరామకృష్ణ, ఏఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.


కమిటీ చైర్ పర్సన్ ఉషారాణితో ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, పాలకవర్గం

ఘనంగా ఘంటసాల జయంతి



పామర్రు: సంగీత సామ్రాజ్యానికి మకుటం లేని మహరాజు అయిన ఘంటసాల వెంకటేశ్వరరావు మన కృష్ణా జిల్లా వాసి కావడం అదృష్టమని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక కళాపరిషత్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టూడియో వద్ద ఘంటసాల 101వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఘంటసాల చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాపరిషత్ అధ్యక్షుడు ఎస్. త్రివిక్రమరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పరిషత్ గౌరవాధ్యక్షుడు పీఎంఎస్ ప్రసాద్, డైరెక్టర్ ఆదినారాయణ పాల్గొన్నారు.

కళాపీఠం ఆధ్వర్యంలో..

స్థానిక హితమ్ పబ్లిక్‌స్కూల్‌లో కళాపీఠం ఆధ్వర్యంలో ఘంటసాల జయంతిని నిర్వహించారు. కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీ కృష్ణ, ప్రిన్సిపల్ నందిపాటి హేమంత్‌రెడ్డి, క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ పాల్గొన్నారు.

ఘనంగా 16 రోజుల పండుగ

కలిదిండి: అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో భాగంగా 16 రోజుల పండుగ సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, ప్రముఖ సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ ముఖ్య అతిథులుగా హాజరై స్వామిని దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గుడివాడ నారాయణస్వామి, పోతురాజు లక్ష్మణరావు, కొండేటి రాజభోగేశ్వరరావు, కొండేటి నాగ రమేష్, సర్పంచ్ ఎం.మారుతి ప్రసన్న, ఎం.వెంకటేశ్వరరావు, పెరుమాళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అనంత శ్రీరామ్, గారపాటి చౌదరి

హైవేపై కూలిన భారీ వృక్షం

కైకలూరు: మిచాంగ్ తుపాను ధాటికి భారీ వృక్షం నెలకొరిగింది. పామర్రు – దిగమర్రు జాతీయ రహదారిపై మండవల్లి – కైకలూరు మధ్య ప్రత్తిపాడు సెంటర్ సమీపంలో భారీ వేపచెట్టు సోమవారం రాత్రి ఒక్కసారిగా నెలకొరిగింది. ఆ సమయంలో వాహనాలు రాకపోకలు లేకపోవడంతో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. విషయం తెలుసుకున్న మండవల్లి ఎస్‌ఐ పి.రామకృష్ణ వెంటనే సిబ్బందితో వెళ్లి ట్రాఫిక్ అంతరాయం లేకుండా కొమ్మలు కొట్టించి, జేసీబీ వాహనం ద్వారా తొలగింపు పనులు చేపట్టారు.


మండవల్లి మండలం ప్రత్తిపాడు సెంటర్ వద్ద జాతీయ రహదారిపై కూలిన భారీ వృక్షం

క్రీడాకారులకు అభినందనలు

గుడివాడ టౌన్: రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలలో తమ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభను ప్రదర్శించి ప్రథమ స్థానంలో నిలిచారని స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి శివ సుబ్రహ్మణ్యేశ్వరరావు(చంటి), సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్ తెలిపారు. ఈనెల 1, 2 తేదీలలో చిత్తూరులో జరిగిన 4వ రాష్ట్ర స్థాయి బాలబాలికల చాంపియన్ షిప్ పోటీలలో తమ క్రీడాకారులు మొదటి స్థానంలో నిలిచారన్నారు. మొత్తం 12 జిల్లాల క్రీడాకారులు పాల్గొనగా తమ క్రీడాకారులు విజయం సాధించారన్నారు. క్రీడాకారులు సీహెచ్ కృష్ణ తన్వీర్, ఎస్‌కే ఫరీద్, ఎం. జ్యోతి గణేష్, జి. రాకేష్, ఎస్. వర్ధన్, ఎస్‌కే అబ్దుల్లా, ఎ. శివ, ఎం. మన్విత్, బి. దేవదానం, సీహెచ్ ఆస్టిన్, డి. ధనుష్, కె. యశ్వంత్‌లను పాలక మండలి సభ్యులు సత్కరించారు. పాలక మండలి సభ్యులు బొగ్గారపు తిరుపతయ్య, నెరుసు శేషగిరిరావు, డి. రవికుమార్, వల్లభనేని వరప్రసాద్, కిలారు రంగప్రసాద్, కోచ్ జి. మల్లికార్జునరావు పాల్గొన్నారు.


విజేతలైన క్రీడాకారులతో స్టేడియం పాలకవర్గ సభ్యులు

భక్తిశ్రద్ధలతో కార్తిక నోములు

మండవల్లి: మండలంలోని గ్రామాల్లో సోమవారం కార్తిక సోమవారం నోములు ఘనంగా జరిపారు. మండవల్లి, కానుకొల్లు, లింగాల, పెరికెగూడెం, కొర్లపాడు, అయ్యావారిరుద్రవరం, భైరవపట్నం, లోకుమూడి తదితర గ్రామాల్లో నోములు నోచుకున్నారు. స్థానిక శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో సాయంత్రం పెద్దసంఖ్యలో భక్తులు వెళ్లి పూజలు చేశారు. అలయ అర్చకుడు గూడూరు శ్రీనివాసరావు పూజలు చేయించారు.

సమపాళ్లలో సంక్షేమం, అభివృద్ధి

గుడివాడ టౌన్: పట్టణంలోని 6వ వార్డు సచివాలయం వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనన్న ఎందుకు కావాలి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సచివాలయం వద్ద లబ్ధిదారులకు అందిన పథకాల వివరాల ఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో ఉందన్నారు. ఇప్పటి వరకు వార్డుకు సంబంధించి 3,928 మంది లబ్ధిదారులకు ప్రత్యక్షంగా 12 కోట్ల 50 లక్షల 79 వేల 684 రూపాయలు, అలాగే 1,711 మంది లబ్ధిదారులకు పరోక్షంగా 7 కోట్ల 4 లక్షల 44 వేల 530రూపాయలు, మొత్తం 19 కోట్ల 55 లక్షల 24 వేల 214 రూపాయలు ప్రభుత్వం అందజేసిందని వక్తలు అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, పార్టీ నాయకులు చుండూరి శేఖర్, దుడ్డు చిన్నా, మహిళా కార్యకర్తలు మూడెడ్ల ఉమ, హారిక, పద్మ, పండు పాల్గొన్నారు.


పథకాల ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

క్లుప్తంగా

ముగిసిన స్టేడియం కమిటీ పదవీకాలం

గుడివాడ టౌన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియం పాలక మండలి పదవీకాలం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్రస్తుత పాలక మండలి సోమవారం విలేకరులతో మాట్లాడుతూ తమ పదవీకాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అనేకమంది క్రీడాకారులను జాతీయ క్రీడాకారులుగా తర్ఫీదు ఇచ్చి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దామన్నారు. స్టేడియాన్ని ఆదాయం కల్పించే లక్ష్యంతో నూతన షాపింగ్ కాంప్లెక్స్ కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. గత మూడేళ్లగా 14 మంది సభ్యులతో కూడిన పాలకవర్గం స్టేడియం అభివృద్ధికి నిరంతరం కృషి చేసిందని, సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నూతన పాలక మండలి ఎన్నిక త్వరలోనే నిర్వహించేందుకు సిఫారసు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి శివ సుబ్రహ్మణ్యేశ్వరారవు(చంటి), సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్, సభ్యులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

కై కలూరు: కై కలూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్ఎస్.ఉమామహేశ్వరరావు సోమవారం చెప్పారు. ఎంపీపీ అడవి కృష్ణ అధ్యక్షతన ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు అందరూ హాజరుకావాలని కోరారు. అలాగే మండలంలో అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో సమావేశానికి రావాలని పేర్కొన్నారు.

ఘనంగా సాయినాథుని పాదుకల ఊరేగింపు



తోట్లవల్లూరు: షిర్డీ సాయిబాబా పాదుకల ఊరేగింపు మండల కేంద్రమైన తోట్లవల్లూరులో సోమవారం ఘనంగా జరిగింది. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల నుంచి వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు పల్లకీలో బాబా పాదుకల ఊరేగింపు కార్యక్రమం జరిగింది. ఆలయంలో ఉంచిన బాబా పాదుకలను భక్తులు అధికసంఖ్యలో దర్శించుకుని పూజలు జరిపారు. వాసవీ ఆలయ చైర్మన్ తాడికొండ ఉదయ సూర్యసుధాకరరావు, వాసవీక్లబ్ అధ్యక్షుడు తమ్మన ఉమామహేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పర్యవేక్షించారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



తోట్లవల్లూరు: అయ్యప్ప నామస్మరణతో మండలంలోని గరికపర్రు, కనకవల్లి గ్రామాలు మార్మోగాయి. ఆయా గ్రామాలకు చెందిన అయ్యప్ప భక్తుల దీక్షాకాలం ముగియటంతో సోమవారం ఇరుముడుల కార్యక్రమం జరిగింది. స్వర్ణకంకణ గ్రహీత కోసూరి శ్రీనివాసరావు, కుమారస్వామి గురుస్వాముల ఆధ్వర్యంలో 30 మంది అయ్యప్ప భక్తులకు ఇరుముడులు కట్టారు. అయ్యప్ప దీక్షాధారులు సాయంత్రం శబరిమలైకు తరలివెళ్లారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక పూజలు



గుడివాడ టౌన్: కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శివాలయాలలో భక్తులు పూజలు నిర్వహించారు. స్థానిక మెయిన్ రోడ్‌లో వేంచేసియున్న భీమేశ్వర స్వామి వారి దేవస్థానం(పెద్ద శివాలయం), గౌరీశంకరపురంలో వేంచేసియున్న గౌరీశంకర స్వామి వారి దేవస్థానం(చిన్న శివాలయం), బేతవోలులోని ఆనందేశ్వర స్వామి వారి దేవస్థానంలలో భక్తులు దీపారాధనలు చేశారు. వేకువజాము నుంచే పూజల్లో పాల్గొని స్వామి వారి దర్శనం చేసుకున్నారు.

శివలింగాకృతిలో రంగవల్లులు



మండవల్లి: మండవల్లిలో కొలువై ఉన్న భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో శివలింగాకృతిలో రంగవల్లులను తీర్చిదిద్దారు. ఆలయ అర్చకుడు గూడూరు శ్రీనివాసరావు శివలింగంను పోలిన ముగ్గు వేశారు. ఈ రంగవల్లులు ఆకట్టుకున్నాయి.